ప్రజాశక్తి
ఆదివారం 14 డిసెంబర్ 2025
5
శ్రీ సత్యసాయి

బ్లాక్ 'స్పాట్స్'లో మార్పులు

ఎన్‌హెచ్-44లో ప్రమాద ప్రాంతాల్లో బ్రిడ్జిలు ఆక్రమణల తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జాతీయ రహదారి-44లోనున్న బ్లాక్ స్పాట్స్‌లో కొన్ని మార్పులు తీసుకొచ్చేందుకు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఎఐ) సంస్థ చర్యలు చేపట్టింది. రోడ్డు ప్రమాదాల్లో అత్యధికం జాతీయ రహదారులపైనే జరుగుతున్నాయి. ఇందులో కొన్ని చోట్ల కూడళ్లలో ఇవి ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించారు. రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లోనూ పదేపదే ఈ అంశాలే చర్చకొస్తున్న నేపథ్యంలో అనంతపురం మీదుగా పోతున్న జాతీయ రహదారి 44లోని బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించారు. అనంతపురం పరిధి వరకు చూస్తే అటు కర్నూలు జిల్లా నుంచి సత్యసాయి జిల్లా సరిహద్దు బాగేపల్లి వరకు జాతీయ రహదారి 44 విస్తరించి ఉంది. ఈ మొత్తంలో 22 ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించినట్టు సమాచారం.

22 ప్రాంతాల్లో మార్పులు

అనంతపురం నుంచి బాగేపల్లి వరకు మొత్తం 22 ప్రాంతాల్లోని కూడళ్లలో మార్పులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో కర్నూలు జిల్లా పరిధిలో ఐదు ప్రాంతాల్లోకాగా, ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 17 ప్రాంతాల్లో మార్పలు చేయనుంది. ఇందులో నాలుగు ప్రాంతాల్లో కొత్తగా ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టాలని ప్రతిపాదించినట్టు సమాచారం. తక్కిన 18 అండర్ పాసుల నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అనంతపురం జిల్లా వరకు చూస్తే 18 ప్రాంతాల్లో మార్పులు చేయనున్నారు. ఇందులో అనంతపురం నగర శివారులోని తపోవనం, రాప్తాడు వద్ద ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇక పామిడి హంపాపురం, గార్లదిన్నె, లోలూరు క్రాస్, వడియం పేట, మామిళ్లపల్లి క్రాస్, పెనుకొండ, పాలసముద్రం, మిషన్ తండా ఇలా మొత్తం 22 చోట్ల గుర్తించిన బ్లాక్ స్పాట్‌లో నేరుగా జాతీయ రహదారిపై వాహనాలు రాకుండా అండర్ పాసులతోపాటు సర్వీసు రోడ్డులను ఏర్పాటు చేసేందుకు జాతీయ రహదారుల సంస్థ సిద్ధమైనట్టు సమాచారం.

అక్రమణల తొలగింపునకు చర్యలు

జాతీయ రహదారుల సంస్థకు సంబంధించిన స్థలాలు ఆక్రమణలకు గురైన వాటిని గుర్తించి తొలగించేందుకు జాతీయ రహదారుల సంస్థ, రెవెన్యూ అధికారులు సర్వేలు నిర్వహించి తొలగిస్తున్నారు. అనంతపురం పరిధిలో ఇప్పటికే తపోవనం ప్రాంతాల్లో తొలగింపు జరుగుతుండగా, అనంతపురం నగర పరిసరాల్లోనూ అనంతపురం నుంచి రాప్తాడు వరకు సర్వే నిర్వహించారు. ఈ సర్వేల్లో అనేక చోట్ల పెద్దఎత్తున జాతీయ రహదారి స్థలాన్ని ఆక్రమించినట్టుగా గుర్తించారు. ప్రధానంగా రాప్తాడు పరిధిలో వచ్చే అనేక ప్రముఖ హోటళ్లే ముందుకొచ్చి పెద్దఎత్తున నిర్మాణాలు కూడా చేపట్టి ఉండటం గమనార్హం. తాజ్ బంజారు హోటల్, హైదారబాదు చెఫ్, పాకశాల హోటళ్ల ముందుకొచ్చాయి. వీటితోపాటు అనేక రెస్టారెంట్ల పరిస్థితి ఇదే రకంగా ఉంది. వాటికి మార్కింగ్ కూడా ఇచ్చారు. త్వరలోనే తొలగిస్తామని నోటీసులిచ్చారు. అయితే యజమానులు తమకున్న పలుకుబడితో దీనిని మార్చేందుకు చూస్తున్నట్లు సమాచారం. ఈ పేరుతో పనులు ప్రారంభం కాకుండా మరికొంత కాలం కాలం వెల్లదీసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

బాబోయ్..కుక్క..!

- జనంపై గ్రామసింహాల దాడి
- ప్రభుత్వాసుపత్రికి బాధితుల పరుగు
- ద్విచక్రవాహనాల వెంటబడుతున్న కుక్కలు
- భయపడి కిందపడుతున్న వాహనదారులు

ఈ ఫొటోలో కన్పిస్తున్న బాలుని పేరు తారక్. అనంతపురం రూరల్ సోములదొడ్డిలో ఉంటాడు. రెండు రోజుల క్రితం బాలుడు ఇంటి వద్ద ఆడుకుంటూ ఉండగా కుక్క కరిచింది. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు.

అనంతపురం సర్వజన ఆసుపత్రిలో రేబిస్ టీకా కోసం వేచి ఉన్న కుక్కకాటు బాధితులు

సోమలదొడ్డిలో కుక్కకాటుకు గురై వ్యాక్సిన్ కోసం కుమారున్ని అనంతపురం సర్వజనాసుపత్రికి తీసుకొచ్చిన తండ్రి

"రెండు రోజుల క్రితం అనంతపురం నగరం హౌసింగ్ బోర్డులో రేషన్ సరుకులు తీసుకునేందుకు ఓ వ్యక్తి స్టోరు వద్దకెళ్లాడు. అతను రేషన్ షాపులోకి వెళ్తుండగా ఓ కుక్క వేనకన వచ్చి కాలికి బలంగా కరిచింది. రేషన్ షాపు వద్ద ఈ ఘటన జరగడంతో ఒక్కసారిగా అక్కడున్న వారు భయాందోళనకు గురయ్యారు. మహిళలు, చిన్నపిల్లలు ఎక్కువగా వస్తున్న ఇలాంటి ప్రాంతాల్లోనూ కుక్కలు దాడులు చేయడం ఆందోళన కలిగిస్తోంది".

"అనంతపురం నగరం విద్యుత్ సర్కిల్ నుంచి ఓ వ్యక్తి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా కుక్కలు వెంటబడ్డాయి. భయాందోళనకు గురైన ఆ వ్యక్తి వేగంగా వాహనాన్ని నడిపాడు. దీంతో అదుపు తప్పి రోడ్డుపై కింద పడి గాయపడ్డాడు".

"శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణం నిజాం వలి కాలనీలో ఇంటి వద్ద ఆడుకుంటున్న ఓ బాలున్ని వీధికుక్కలు తీవ్రంగా కరిచాయి. తీవ్రంగా గాయపడిన బాలున్ని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బాలుడు కదిరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు".

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్, కదిరి టౌన్

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కుక్కలు ఎలా జనంపై దాడి చేస్తున్నాయన్న దానికి కొన్ని ఉదాహరణలు మాత్రమే ఇవి. పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా దాదాపు అన్ని ప్రాంతాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పలువురిపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. కుక్కలను పట్టుకుని పట్టణానికి దూరంగా తరలిస్తామంటూ అధికారులు, ప్రజాప్రతినిధుల మాటలు నామమాత్రమే అన్నట్లు కన్పిస్తోంది. కుక్కకాటుతో ప్రతి రోజూ అనంతపురం సర్వజన ఆసుపత్రిలో 50 నుంచి 80 మంది చికిత్స నిమిత్తం వెళ్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రులకు పెద్ద సంఖ్యలో కుక్కకాటు బాధితులు వెళ్తున్నారు. శనివారం నాడు ఉదయం 11 గంటల్లోపుగానే అనంతపురం సర్వజన ఆసుపత్రిలో కుక్కకాటుకు గురైన 55 మంది వ్యాక్సిన్ వేయించుకున్నారు. సాయంత్రానికి ఈ సంఖ్య మరింత పెరిగింది. ఒక్కోరోజు వందకు పైగా కుక్కకాటుకు గురైన వారు వ్యాక్సిన్ వేయించుకుని వెళ్తుంటారని వైద్యులు చెబుతున్నారు.

రోడ్లపై కుక్కల గుంపు.. వాహనదారులపై దాడి

నగరంలో రోడ్లపై కుక్కల గుంపులు కన్పిస్తాయి. రోడ్డుపై ఉన్న కుక్కల గుంపును చూసి ఆ వీధుల్లోకి వెళ్లేందుకు జనం భయపడుతున్నారు. వీధుల్లో కుక్కల నియంత్రణకు సంబంధిత మున్సిపల్,కార్పొరేషన్ అధికారులు సంతన నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నామని చెబుతున్నా వాటి సంఖ్య మాత్రం తగ్గుతున్న దాఖలాలు లేవు. కుక్కల దాడిలో అత్యంత ప్రమాదకరంగా వాహనదారులపై చేసే దాడులు కన్పిస్తున్నాయి. వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనాల వెంట కుక్కల గుంపు వెంటపడుతోంది. వాహనం వెళ్లే వేగానికి సమానంగా కుక్కలు పరిగెడుతున్నాయి. దీంతో వాహదారుడు తీవ్ర భయాందోళనకు గురై వేగంగా వెళ్లి కిందపడడం లేదా కుక్కకాటుకు గురవడం లాంటి ఘటనలు అధికంగా జరుగుతున్నాయి. భార్యాభర్తలు వెళ్తున్న సమయంలో అయితే వెనుక కూర్చొన్న మహిళల చీరలు లాగి కిందపడేలా చేస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులపైన కూడా వీటి దాడులు అధికంగా ఉంటున్నాయి.

కదిరిలో కుక్కకాటుకు గురైన బాలుడు

కుక్కలను నియంత్రించాలి

కుక్కలు రోడ్లపై అధికంగా ఉంటున్నాయి. ద్విచక్రవాహనంపై వెళ్తుంటే వెంటబడుతున్నాయి. వాటిని తప్పించుకునేందుకు భయంతో వాహనాన్ని వేగంగా నడిపితే కింద పడిన సందర్భాలూ ఉన్నాయి. వారం రోజులుగా క్రితం సాయంత్రం వేళ ఇంటికి వెళ్తున్న సమయంలో ఓ కుక్క వెంటబడివంది. దీంతో తీవ్ర భయాందోళనకు గురయ్యాను. కార్పొరేషన్ అధికారులు వీటిపై స్పందించాలి.

డి.అశ్వర్థనారాయణ, నవోదయ కాలనీ,అనంతపురం.

కుక్కలను నియంత్రించండి : సిపిఎం

కదిరి టౌన్ : కదిరి పట్టణం నిజాంవళి కాలనీలో కుక్కల దాడిలో యాసిన్ అనే చిన్నారి శనివారం నాడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం బాలుడు కదిరి పట్టణంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సిపిఎం నాయకులు జిఎల్.నరసింహులు, బాబ్‌జాన్, ముస్తాక్ అలీ, రామ్మోహన్, ఆంజనేయులు ఆసుపత్రికి వెళ్లి బాలుని ఆరోగ్య పరిస్థితి గురించి తల్లిదండ్రులతో అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కదిరి పట్టణంలో కుక్కల దాడులు అధికమయ్యాయని, ముఖ్యంగా పిల్లలను విచక్షణా రహితంగా కరుస్తున్నాయన్నారు. ఇంతమంది కుక్కల బారిన పడుతున్నా మున్సిపల్ అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. అధికారులకు పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజలసమస్యలపై లేకపోవడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి జిల్లా వ్యాప్తంగా కుక్కల నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కదిరిలో కుక్కకాటుకు గురైన బాలుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణం లోని ఐదు కేంద్రాల్లో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, అజీజియా మున్సిపల్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, నేతాజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ముద్దిరెడ్డిపల్లి బాలుర ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎంజిఎం ఉన్నత పాఠశాలలో 264 మందికి గాను 165 మంది హాజరుకాగా 99 మంది హాజరు కాలేదు. అజీజియా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 264 మందికి గాను 151 మంది హాజరుకాగా 113 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 264 మందికి గాను 72 మంది హాజరు కాగా 192 మంది హాజరు కాలేదు. నేతాజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 186 మందికి గాను 40 మంది హాజరు కాగా 146 మంది గైర్హాజరయ్యారు. ముద్దిరెడ్డిపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో 264 మందికి గాను 156 మంది హాజరుకాగా 108 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా ఐదు సెంటర్లకు కలిపి 1242 మందికి గాను 584 మంది హాజరుకాగా 658 మంది గైర్హాజరయ్యారు. హాజరైన విద్యార్థుల కంటే హాజరుకాని విద్యార్థుల సంఖే ఎక్కువగా ఉంది. మహాత్మా గాంధీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఆర్డీవో ఆనంద్ కుమార్ తనిఖీ చేయగా ఆయా పరీక్ష కేంద్రాలను డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్న లక్ష్మి తనిఖీ చేశారు.

పిల్లలకు మరో తల్లి అంగన్వాడీ కార్యకర్త: ఎమ్మెల్యే

అంగన్వాడీ కార్యకర్తలకు సెల్ ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సునీత

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

పిల్లలకు మరో తల్లిలాగా అన్నీ నేర్పేది అంగన్వాడీ సిబ్బందే అని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలి పారు. రామగిరి ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలా ల్లోని 171 మంది అంగన్వాడీ కార్యకర్తలకు ఎమ్మెల్యే సెల్‌ఫోన్లు పంపిణీ చేశారు. అలాగే చెన్నేకొత్తపల్లి మండలం-6, రామగిరి-4, కనగానపల్లి-8 మంది అంగన్వాడీ మినీ వర్కర్స్‌ను మెయిన్ వర్కర్స్‌గా ఉద్యోగోన్నతి కల్పించడంతో వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో భాగంగానే కూటమి ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు ఈ సెల్‌ఫోన్లు పంపిణీ చేస్తుందన్నారు. భోజనం తినడం, అ, ఆ..లు నేర్పించే వరకూ అన్నీ వారు ఒక తల్లిలా చూసుకుంటారన్నారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాల న్నారు. పిల్లల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ప్రభుత్వం నుంచి వచ్చే ఆహారాన్ని ఎప్పటి కప్పుడు అందించాలన్నారు. మీ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి సెల్‌ఫోన్, తదితర వాటి వల్ల పిల్లలకు కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

త్వరలో చెరువులు నింపుతాం : కందికుంట

ప్రజాశక్తి-గాండ్లపెంట

హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణా జలాలతో త్వరలోనే మండలం లోని చెరువులను నింపుతా మని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ప్రజాదర్బార్‌లో అందిన ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని భయ్యారెడ్డిపల్లిలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఆర్డీవో వివిఎస్.శర్మ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు 30 అర్జీలు అందాయన్నారు. అందులో పింఛన్లు, హౌసింగ్, భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఆయా అర్జీలను వేగవంతంగా పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు. కదిరి-రాయచోటి రోడ్డు మరమ్మతులు చేపట్టామన్నారు. చామల గొంది పంచాయతీలో రోడ్డు సౌకర్యాలు, చెరువు కట్ట వెడల్పు పెంచాలని ప్రజలు కోరగా వెంటనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డి.ఆనంద్, మేకల శివప్ర సాద్ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. స్పం దించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీలో బిల్లు పాస్ కావడంతో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు, ఎంపిపి జి.సోమశేఖర్‌రెడ్డి, సర్పంచి ఎస్.శివప్ప రాయుడు, టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య, ప్రసాద్, డి.ఆనంద్, ఎస్.అక్రమ్‌బాషా, సికిందర్, జనసేన సత్యవతి పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

గంగినాయుడువారిపల్లిలో స్క్రబ్‌టైఫస్ కేసు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని గంగినాయినివారిపల్లిలో స్క్రబ్‌టైఫస్ కేసు నమోదు అయ్యింది. గ్రామానికి చెందిన రెడ్డి బాబు అనే వ్యక్తి వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. అయినా నయం కాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను మెరుగైన వైద్యం కోసం బెంగుళూరు సైంట్‌జాన్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆయనకు స్క్రబ్‌టైఫస్ సోకినట్లు నిర్ధారించారు. అప్రమత్తమైన వైద్యాధికారులు గంగినాయనివారిపల్లి గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వ వైద్యాధికారి ఆనంద వర్ధన్ సిబ్బందితో వెళ్లి వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ నాగలక్ష్మి, సూపర్‌వైజర్ మహేశ్వర్ రెడ్డి, ఆదినారాయణ, రమేష్ రెడ్డి, దేవీ పాల్గొన్నారు.

ఫైనల్‌కు చేరిన హిందూపురం, పరిగి జట్లు

పెనుకొండలో ఫైనల్ మ్యాచ్:ఎంఇఒ

ప్రజాశక్తి-హిందూపురం

ఉపాధ్యాయ ఉపాధ్యాయులకు జోనల్ స్థాయి క్రీడా పోటీలు పట్టణంలోని ఎంజీఎం మైదానం, రూరల్ మండల పరిధిలోని బసవనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్నలక్ష్మిలు పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో పెనుగొండ జోన్‌లోని 12 మండలాల్లో అమరాపురం, ఆగళి రెండు మండలాలు మినహా మిగిలిన 10 మండలాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు ఎన్ని పాల్గొన్నట్లు ఎంఇఒ గంగప్ప తెలిపారు. మహిళల త్రో బాల్ పోటీలో 8 మండలాలకు గాను గుడిబండ మినహా 7 మండలాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు తెలిపారు. త్రో బాల్‌లో విజేతగా హిందూపురం టీం నిలిచిందన్నారు. జోనల్ స్థాయికి హిందూపురం పరిగి, మండలాలు ఎంపికైనట్లు వివరించారు. ఈ రెండు చెట్లు అధికారుల సూచనల మేరకు ఈనెల 15వ తేదీ లేదా 16వ తేదీ పెనుగొండ పట్టణంలో జోనల్ స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎంఇఒలు లక్ష్మీదేవి, శేషాచలం, పీడీలు లోకనాథ్, సురేష్, అమర్ పాల్గొన్నారు.

235 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-హిందూపురం

కంటి జబ్బులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కంటి వైద్య నిపుణులు యశస్వి, నేహా పేర్కొన్నారు. ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 235 మందికి కంటి పరీక్షలు నిర్వహించిన అందులో 105 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ కంటి జబ్బు బాధితులు నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య సేవలు పొందాలన్నారు. వైద్య శిబిరం నిర్వాహకులు ఎన్‌పి.కుమార్ రాజా మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండవ శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆపరేషన్లు ఎంపికైన వారిని బెంగళూరులోని శంకర్ నేత్రాలయం తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయించడంతోపాటు అవసరమైన మందులను, కంటి అద్దాలను అందజేస్తామన్నారు. టిడిపి నాయకులు జి.ఆర్.రమేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరానికి హాజరైన వారందరికీ భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఉషారాణి, క్యాంపు నిర్వహకులు నీల శివశంకర్, వాలంటీర్లు నరసింహమూర్తి, షమీం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలను పరిశీలన చేస్తున్న ఆర్‌డిఓ ఆనంద్ కుమార్

రాస్తారోకో చేస్తున్న మావటూరు గ్రామస్తులు

బస్‌షెల్టర్ కూల్చివేత

గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రయాణికులు వేచి ఉండే బస్సు షెల్టర్లు తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ నాయకుడు రాత్రికిరాత్రి కూల్చివేసిన ఘటన మండల పరిధిలోని మావటూరు గ్రామంలో చోటు చేసుకుంది. బస్సు షెల్టర్‌ను అర్ధరాత్రి అక్రమంగా కూల్చివేయడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు రాత్రికిరాత్రే బస్ సెంటర్‌ను కూల్చివేశారని ఆరోపిస్తూ గ్రామస్తులు శనివారం పెనుకొండ, మడకశిర ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. మావటూరు గ్రామంలో సంవత్సరాలుగా ప్రజలకు ఉపయోగపడుతున్న బస్సుషెల్టర్‌ను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేయడం అన్యాయమని గ్రామస్తులు మండిపడ్డారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ఎండ, వానలకు తడిసి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కూల్చివేసిన బస్సు షెల్టర్‌ను తిరిగి నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సర్పంచి నాగరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ప్రజా సమస్యలపై పాలకులు స్పందించాల్సిన అవసరం ఉందని, ప్రజల సౌకర్యాల్ని ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని నిరసనకారులు అన్నారు. అధికార పార్టీకి చెందిన వారే ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం దుర్మార్గమని విమర్శించారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. బస్సు షెల్టర్ పునర్‌నిర్మాణంపై స్పష్టమైన హామీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే సహకారంతో పట్టణాభివృద్ధి

మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణాన్ని వేగవంతంగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే హిందూపురాన్ని ప్రథమ స్థానంలో నిలపాలన్నదే ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ లక్ష్యమని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, టిడిపి పొలిటికల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని చౌడేశ్వరిలో ఉన్న ఉద్యానవన ప్రవహరీ గోడ నిర్మాణంలో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.22లక్షలతో పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు బాలాజీ, వీరయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూపురం పురపాలక సంఘాన్ని అన్ని విధాలా అభివద్ధి చేసి ఒక ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడానికి అవసరమైన అన్ని ప్రణాళికలూ రూపొందించుకుని ముందుకు పోతున్నట్లు వివరించారు. ఇప్పటికే పట్టణ సమగ్రాభివద్ధి కోసం రూ.92.50 కోట్లు ప్రత్యేక నిధులను తీసుకురావడం జరిగిందన్నారు. అహుడా నిధులు, అటవీ శాఖ నుంచి సైతం విధులను తీసుకొని వచ్చి వివిధ అభివద్ధి పనులను చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రామచంద్ర, టిడిపి పట్టణ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు నాగరాజు, రాము, వెంకటలక్ష్మి, దుర్గా నవీన్, అశోక్, రవి ప్రసాద్, రవీంద్ర, భార్గవ్, అమీన్ ఆంజనేయులు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న ఛైర్మన్, అధికారులు

ఆంధ్ర క్రికెట్ జట్టు ప్రాబబుల్స్‌కు విద్యార్థినులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఆంధ్ర క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించే అండర్-15 బాలికల ఆంధ్ర క్రికెట్ జట్టు ప్రాబబుల్స్ పోటీలకు పట్టణంలోని సాధన పాఠశాల విద్యార్థినులు తేజశ్విణి, హుస్నారా ఎంపికయ్యారు. తేజశ్విణి కుడిచేతి వాటం బౌలింగ్‌లో, హుస్నారా ఓపెనింగ్ బ్యాటర్‌గా ఆడనున్నారు. తేజశ్విణి గత సీజన్‌లో అండర్-15 రాష్ట్ర జట్టుకు, అండర్-15 జాతీయ క్రికెట్ శిబిరానికి ఎంపికైంది. హుస్నారా తొలిసారి ఈ పోటీలకు ఎంపికైంది. వీరు ప్రాబబుల్స్ పోటీల్లో రాణించి రాష్ట్ర జట్టుకు ఎంపికవ్వాలని పలువురు ఆకాంక్షించారు. వారిని ఉపాధక్షులు పవన్‌కుమార్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, సభ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

తేజశ్విణి, హుస్నారా

హిందూపురంలో కక్షిదారులకు అవార్డు ప్రతులను అందజేస్తున్న న్యాయమూర్తులు

కదిరిలో లోక్అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి జయలక్ష్మి

రాజీ కేసులకు చక్కటి పరిష్కార వేదిక లోక్ అదాలత్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాజీ కాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం చూపుతుందని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి అధ్యక్షతన శనివారం పుట్ట పర్తిలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 164 కేసులు పరిష్కరించారు. జడ్జి మాట్లాడుతూ చిన్నపాటి తగాదాలు, మనస్పర్థలు, పట్టింపులకు పోయి కేసులు నమోదు చేసుకొని ఏళ్ల తరబడి కోర్టు ల చుట్టూ తిరిగి నష్టపోకుండా లోక్ అదాలత్ ద్వారా కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా చక్కటి పరిష్కారం చూపుతున్నామ న్నారు. తద్వారా కక్షిదారుల మధ్య సత్సంబంధాలు ఏర్పడి గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి దోహదం కలుగుతుందన్నారు. చెక్ బౌన్స్ కేసుల్లో కక్షిదారుల మధ్య సయోధ్య కుదిరితే చెల్లింపులకు దశలవారీ చెల్లింపు గడువుతో అవార్డు జారీ చేస్తామ న్నారు. ఇరు వర్గాలను లోక్ అదాలత్‌లో విచారించి దోషాలను వారికి వివరించి భవిష్యత్తులో పునరావృతం కారాదని హెచ్చరికలు సైతం జారీ చేస్తుండడంతో వారిలో నేర స్వభావం తగ్గించేందుకు అవకాశం ఉందన్నారు. సుదీర్ఘకాలం కొనసాగుతున్న సివిల్ తగాదాలు, వివిధ సమస్యలపై కోర్టును ఆశ్రయించిన వారు పట్టింపులకు పోకుండా సర్దుబాటు ధోరణిలో పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం జరుగుతుందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పుట్టపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, లెక్కల యదుభూషణ్, కుంచెపు శ్రీనివాసులు, నాగేంద్ర, మౌనిక, కిరణ్, క్రిమినల్ క్లర్క్ మంజునాథ్, సివిల్ క్లర్క్ జ్యోతిబాయి, ఎంఎల్ ఎసి లక్ష్మానాయక్, వివిధ శాఖల బ్యాంకు మేనేజర్లు, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి మాట్లాడుతూ చాలా రోజులుగా పరిష్కారానికి నోచుకోని పెండింగ్ కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కారం అయ్యాయని, కక్షిదారులకు న్యాయం జరిగిందని తెలిపారు. సమావేశంలో జడ్జి లోకనాథం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌడప్ప, న్యాయవాదులు పాల్గొన్నారు.

పురంలో 245 కేసులు పరిష్కారం : ఎడిజె కంపల్లె శైలజ

హిందూపురం : పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాల చుట్టూ తిరిగి వ్యయ ప్రయాసాలకు గురి కాకుండా రాజీమార్గంలో కేసులను పరిష్కరించు కోవడం ఎంతో మంచిదని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. శనివారం సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, అదరపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ హారిక కోట, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యలతో కలిసి ఎడిజె జాతీయ మెగాలోక్ అదాలత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ కక్షిదారుల ఇబ్బందులకు గురి కాకూడదన్న ఉద్దేశంతో జాతీయ స్థాయి నుండి గ్రామస్థాయి వరకు రాజీమార్గంలో కేసులను పరిష్కరించు కొనేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. అనంతరం నాలుగు బెంచ్‌లను ఏర్పాటు చేసి 245 కేసులను పరిష్కరించారు. ఇందులో ఎనిమిది సివిల్ తగాదాలను పరిష్కరించి కక్షిదారులకు రూ.1,25,90,000 ప్రయోజనం చేకూర్చగా ఏడు ఈపీల పరిష్కారం ద్వారా రూ.1,01,99,116 లబ్ధి చేకూరింది. 12 చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించి బాధితులకు రూ.32,42,350 ఇప్పించగా నాలుగు భరణం కేసుల ద్వారా రూ.3 లక్షలను అందించారు. 27 ఐపిసి కేసులు, రెండు విడాకుల కేసులు పరిష్కరించారు. 85 అక్రమ మద్యం రవాణా కేసులను పరిష్కరించి ప్రభుత్వానికి రూ.3,78,392 అపరాధ రుసుం కింద జమ చేశారు. 38 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించి బ్యాంకులకు రూ.25,87,607 చెల్లించగా 62 చిన్నపాటి తగాదా కేసులను పరిష్కరించి రూ.4,06,570 అపరాధ రుసుం వసూలు చేశారు. బ్యాంకుల సహకారంతో హాజరైన కక్షిదారులకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు సంతోషి కుమారి, సతీష్, నవేరా, జగదీష్, రవిచంద్ర, అంజనమ్మ, కళావతి, యూసుఫ్‌లతోపాటు న్యాయవాదులు, న్యాయస్థానాల సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే

ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి-కదిరి టౌన్

ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం వచ్చే భక్తజనానికి ఇబ్బం దులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ఏర్పాట్లపై శనివారం ఆయన పట్టణంలోని ఆలయంలో అధికారులు, అర్చకులతో చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీవారి దర్శనార్థం పలు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అందరి సహకారంతో వేడుకలను విజయవంతం చేద్దామని కోరారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు పార్థసారథి, అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన రోడ్డు పనులు

ఏళ్ల తరబడి ఆగిన రోడ్డు పనులకు మోక్షం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని కదిరేపల్లి వద్ద హంద్రీనీవా కాలువపై కోట్లాది రూపాయలు ఖర్చు చేసి వంతెన నిర్మించారు. అయితే వంతెన పూర్తయిన తర్వాత అక్కడ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. ప్రస్తుతం ఆ వంతెనకు సమాంతరంగా రోడ్డు మరమ్మతులు చేపట్టారు. దీంతో ఏళ్ల తరబడి ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తప్పుతాయని చెప్పవచ్చు.

చిరుత దాడిలో పొట్టేళ్లు మృతి

ప్రజాశక్తి-పెనుకొండ

పొట్టేళ్లను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పట్టణంలోని జిఐసి కాలనీలో శనివారం తెల్లవారుజామున పొట్టేళ్ల గుంపుపై ఓ చిరుతదాడి చేయడంతో రైతు వెంకటేశ్‌కు చెందిన మూడు పొట్టేళ్లు మృతి చెందాయి. తద్వారా రూ. 1.2లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. సమాచారం తెలుసుకున్న పశు వైద్యురాలు జాహ్నవి, డిప్యూటీ రేంజర్ చాంప్లా నాయక్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాహుల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం తరపున రైతుకు పరిహారం చెల్లిస్తామని వారు హామీ ఇచ్చారు. చిరుత దాడి సంచారం నేపథ్యంలో జిఐసి కాలనీతో పాటు పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు. వారి వెంట టిడిపి నాయకులు శ్రీరాములు, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, బండా నూర్, షౌకత్, షమూన్, శివా నాయక్, మల్లికార్జున బాధిత రైతును పరామర్శించారు.

గ్రామ స్వరాజ్యనిధిపై అవగాహన

ప్రజాశక్తి-గుడిబండ

గ్రామ స్వరాజ్య నిధులను గ్రామల అభివృద్ధికే ఖర్చు పెట్టాలని ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున ఆర్‌డిటి లబ్ధిదారులకు సూచించారు. స్థానిక స్త్రీ నిధి కార్యాలయంలో శనివారం మండలం లోని ఆర్‌డిటి లబ్ధిదారులకు గ్రామ స్వరాజ్య నిధి వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌డిటి సంస్థ 20 ఏళ్ల క్రితమే ఒక్కో కుటుంబానికి రూ. 20 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిందని, ఆ నిధులు ప్రస్తుతం రెండింతలు అయ్యాయన్నారు. వాటిని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పాడి పశువుల కొను గోలు, గొర్రెలు, మేకల పెంపకం, వాటర్ ప్లాంట్ ఏర్పాటు, కమ్యూనిటీ భవనాలకు రంగులు, మరమ్మ తులు, ఫ్లవర్ డెకరేషన్, షామియానా ఏర్పాటు చేసు కోవడం, తదితర వాటికి ఖర్చు చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో ఆర్‌డిటి సీఈవో మంజునాథ్, ఎపిసి ఓబులేష్, సిబ్బంది, పాల్గొన్నారు.

వికలాంగుల దినోత్సవంపై ర్యాలీ

ప్రజాశక్తి-గుడిబండ

గుడిబండలో శనివారం ఆర్‌డిటి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా వికాంగులు స్థానిక మోరుబాగల్ రోడ్డులో ఉన్న ఆర్‌డిటి కమ్యూనిటీ భవనం నుంచి పురవీధుల గుండా బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి వికలాంగుల హక్కులపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత కమ్యూనిటీ భవనానికి చేరుకుని సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ తహశీల్దార్ రాంభూపాల్‌రెడ్డి మాట్లా డుతూ వికలాంగులను సమాజంలో ఇతరులతో సమానం గా గౌరవించాలన్నారు. అమరాపురం మండలం తంబాలహట్టి గ్రామానికి చెందిన దీపిక అంధుల మహిళల క్రికెట్ వరల్డ్ కప్ సాధించి దేశానికే వన్నె తెచ్చిందని కొనియాడారు. కార్యక్రమంలో మహిళ మండలి సమైక్య అధ్యక్షురాలు సౌభాగ్య, వైస్ ప్రెసిడెంట్ తిప్పేస్వామి, ఈసీ మెంబర్ ఈ.రమారప్ప, ఎంజేరప్ప, ఆర్‌డిటి సిబ్బంది, గ్రూప్ ఆర్గనైజర్ శ్రీరాములునాయక్, చలపతి పాల్గొన్నారు.

ఘనంగా కనకదాసు జయంతి వేడుకలు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని గౌరాజుపల్లి, తురకలాపట్నం, రెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కురుబ సామాజిక వర్గం మహిళలు నెత్తిన జ్యోతులు ఎత్తుకుని కనకదాసు చిత్రపటాన్ని ఊరేగించారు. జ్యోతులను కనకదాసు విగ్రహం వద్ద సమర్పించారు. కార్యక్రమంలో కురుబ సామాజిక వర్గం ప్రజలు పాల్గొన్నారు.

గౌరాజుపల్లిలో జ్యోతులు తీసుకెళ్తున్న మహిళలు

యుటిఎఫ్ మండల కమిటీలు ఎన్నిక

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలో శనివారం యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు అధ్యక్షతన కదిరి రూరల్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి చెన్నూరు తాహెర్‌వలి వ్యవహరించారు. అధ్యక్షులుగా టి.మల్లికార్జున, గౌరవాధ్యక్షులుగా కిన్నెర ప్రసాద్, అధ్యక్షులుగా కెఎండి. హనీఫ్, ఉపాధ్యక్షులుగా ఎం.రెడ్డి శేఖర్, ఎ.మంగమ్మ, ప్రధాన కార్యదర్శిగా జె.నాగరాజు, కోశాధికారిగా కె.రామ కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా కె.సునీల్ కుమార్, ఎం.వెంకటశివ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.సత్యనారాయణ, కార్య దర్శులుగా ఎం.గీతాబాయి, డి.లోకేష్‌గుప్తా, కె.బాలాజీనాయక్, ఎండి.సల్మా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ వృత్తి ధర్మాన్ని పాటిస్తూనే, విద్యా రంగం పరిరక్షణ, ఉపాధ్యాయుల హక్కుల సాధన, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకై నిరంతరం ప్రయత్ని స్తామని తెలిపారు. ఉపాధ్యాయులకు అధికారులకు వారధిగా సమన్వయం చేసుకుంటూ విద్యాశాఖ గౌరవాన్ని పెంచేలా కృషి చేస్తామని తెలిపారు. నూతన కమిటీకి జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

గోరంట్ల : స్థానిక ఎంఆర్‌సి కార్యాలయ ఆవరణలో యుటిఎఫ్ నాయకులు పి.మురళి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల నూతన శాఖను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కమిటీ సభ్యులు మారుతి శ్రీనివాస్, జిల్లా ట్రెజరర్ శ్రీనివాసులు వ్యవహరించారు. అధ్యక్షులుగా కె. చాంద్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా ఎ.నగేష్, గౌరవాధ్యక్షులుగా కృష్ణప్రసాద్, జిల్లా కౌన్సిలర్‌గా రామాం జనేయులు, కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా నరసింహులు, ట్రెజరర్‌గా రామకృష్ణ, తదితరులను ఎన్నుకు న్నారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్‌సి కమిటీ వేయాలని, కమిటీ నియామకం ఆలస్యమైతే వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, డిఎలు మంజూరు చేయాలని, పాత పెన్షన్ విధానం కొనసాగించాలని, ఉపాధ్యాయు లకు బోధనేతర పనులు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బాబు, జిల్లా కార్యదర్శి క్రిష్టప్ప, నాయకులు చెన్న, అనిల్, శ్రీనివాసులు, మధుసూదన్, హిదయతుల్లా, వెంకటేష్, రామచంద్ర, సూర్య నారాయణరెడ్డి, చంద్ర శేఖర్, శ్రీనివాసులు, క్రిష్టప్ప, సురేష్, అంజనప్ప, ఈశ్వరప్ప, ఆంజనేయులు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ధర్మవరం రూరల్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.ఆంజనేయులు, ఎం.వెంకటకిషోర్‌లను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి ఆర్ రామకృష్ణనాయక్ తెలిపారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నిరంతరం అందుబాటులో ఉంటూ విద్య, ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. గౌరవాధ్యక్షులుగా పి.విజయభాస్కర్, ఉపాధ్యక్షురాలుగా ఎస్.రమీజాబి, కోశాధికారిగా ఎన్.జనార్ధన్‌బాబు, కార్యవర్గ సభ్యులుగా శ్వేత, వేణుగోపాల్, అంజి, తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సకల చంద్రశేఖర్, పి.సురేష్, అమరనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో యుటిఎఫ్ మండల నూతన కమిటీతో శెట్టిపి జయచంద్రారెడ్డి

గ్రామాల అభివృద్ధికి కూటమి పెద్దపీట

నూతన భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

ప్రజాశక్తి-మడకశిర టౌన్

గ్రామాల అభివృద్ధికి కూటమిప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే ఎంఎస్. రాజు తెలిపారు.మండలంలో ఇటీవల నూతనంగా నిర్మించిన పలు భవనాలను శనివారం ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. వారు గుండుమలలోని కెజిబివిలో కళాశాల నూతన భవనం, గోవిందపురంలో నూతన సచివాలయ భవనం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, గంగులవాయిపాల్యంలో సచివాలయ భవనం, రైతు సేవా కేంద్రం భవనాల ప్రారంభోత్సవంలో పాల్గొ న్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కెజిబివి కళా శాల భవనంలో విద్యార్థినులకు అన్ని వసతులు కల్పించా లని, నాణ్యమైన విద్య, భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులు ఇష్టంగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన 9వ తర గతి విద్యార్థిని దిశాను అభినందించి సన్మానించారు. సచివా లయం, రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

అగళి : మండలంలోని నరసంభూది పంచాయతీలో, ఆలూడి పంచాయతీలోని కొమరేపల్లిలో, రామనపల్లి గ్రామాల్లో సచివాలయ భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అగళి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొని రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. టోర్న మెంట్‌లో రాత్రిపూట వెలిగించే విద్యుత్ దీపాలకు ఆర్థిక సాయం అందజేశారు. అగళిలో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, గ్రామాలకు తారు రోడ్లు వేస్తామని తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అందరిపై ఉందన్నారు. వారి వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, కుంచితి వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ స్వామి, జడ్పిటిసి ఉమేష్, మండల కన్వీనర్ తిప్పేస్వామి, సింగిల్‌విండో అధ్యక్షులు కుమార్‌స్వామి, సింగిల్‌విండో అధ్యక్షులు, నాయకులు ఉన్నారు.

మడకశిర : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి

విద్యార్థి దశ నుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధమవ్వాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు చదువుతో పాటు విద్యార్థి దశ నుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతూ, వాటికి పోటీపడి చదవాలని అల్‌హిలాల్ పాఠశాల హెచ్‌ఎం అక్బర్ షరీఫ్, అల్ అమీన్ పాఠశాల కరెస్పాండెంట్ రియాజ్ తెలిపారు. అసోసి యేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్ (ఎఎంపి) ఆధ్వర్యంలో విద్యార్థుల ఉపకార వేతనం, వివిధ పోటీ పరీక్షల కోసం శనివారం పట్టణంలోని అల్‌అమీన్, ఇక్రా పాఠశాలలో పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అల్ హిలాల్ పాఠశాల హెచ్‌ఎం అక్బర్ షరీఫ్, పాఠశాల కరెస్పాండెంట్, ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రియాజ్, ఇక్రా పాఠశాల ఛైర్మన్ నజీరుద్దీన్ పాల్గొని ఆయా పాఠశాలల్లో ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 8వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులకు ఎంట్రన్స్ పరీక్షలను నిర్వహించి ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించి ప్రోత్సహించడంతో పాటు నీట్, సియుఈటి, ఐఐటి, జేఈఈ, సిడిఎస్, ఎన్‌డిఎ, జాతీయ స్థాయిలో నిర్వహించే యుపిఎస్‌సి పరీక్షలకు సైతం శిక్షణ ఇవ్వడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇక్రా పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ అఖీబ్ జావిద్, హెచ్‌ఎం షాకిర, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

వైసిపి పోలింగ్ బూత్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా పతాంజలి

ప్రజాశక్తి-బుక్కపట్నం

బుక్కపట్నంకు చెందిన వైసిపి నాయకుడు రత్నాకరం పతాంజలిని వైసిపి జిల్లా పోలింగ్ బూత్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో తన ఎన్నికకు సహకరించిన సహకరించిన పార్టీ అధినేత జగన్, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని, రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి పని చేస్తానని తెలిపారు. పతాంజలిని మండల నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

కల్లుగీత కార్మికునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నల్లచెరువు

మండలంలోని ఎం.అగ్రహారం గ్రామా నికి చెందిన కల్లుగీత కార్మికుడు ఆంజనేయులు చెట్టుపై నుంచి కిందకు పడడంతో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నారు. ప్రసార మాధ్యమాల ద్వారా ఈ విషయం తెలుసుకున్న దాదెం వెంకట శివారెడ్డి కుమారుడు అమెరికాలో ఉంటున్న ఎన్‌ఆర్‌ఐ దాదెం బయపరెడ్డి అతడి వైద్యం కోసం రూ. 10 వేలు ఇచ్చారు. నగదును సర్పంచి ద్వారా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శిగా రాజారెడ్డి

ప్రజాశక్తి-కొత్తచెరువు

వైసిపి జిల్లా ప్రచార ప్రధాన కార్య దర్శిగా లోచర్ల మాజీ సర్పంచి రాజారెడ్డిని అధిష్ఠానం నియమించి నట్లు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి ఈ పదవి కేటాయించారన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, జిల్లాలో పార్టీని మరింత బలో పేతం చేస్తామన్నారు. తనకు ఈ పదవి ఇచ్చినం దుకు మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

పలువురు అధికారుల డుమ్మా

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం ఎంపిపి రాధమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశం తూతూ మంత్రంగా జరిగిందన్న విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా హౌసింగ్, విద్యుత్, వెటర్నరీ, రవాణా, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, విద్య, ఇరిగేషన్, తదితర శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో సభ్యులు సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియక మిన్నకుండి పోయారు. హాజరైన అధికారులు వారి శాఖలో అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. సింగిల్‌విండో అధ్యక్షులు మద్దన కుంటప్ప, జడ్పిటిసి సభ్యులు భూతరాజు మాట్లాడుతూ అధికారులు లేని సమావేశం నిర్వహించడం ఎందుకు.. వాయిదా వేయాలని, గైర్హాజరైన అధికారులకు నోటీసులు ఇవ్వాలని కోరారు. స్పందించిన డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజునాయక్ సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో ఆయా అధికారులకు నోటీసులు ఇస్తామని, ప్రస్తుతం సమావేశాన్ని జరగనివ్వాలని సర్ది చెప్పారు. మద్దనకుంటప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తుంద న్నారు. హౌసింగ్ అధికారులు సమావేశానికి రాకపోతే ఆ వివరాలు ఎవరిని అడగాలని ప్రశ్నించారు. అధికారులు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తే గ్రామాల్లో అభివృద్ధి ఎలా సాగుతుందన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సమావేశంలో జడ్పిటిసి సభ్యులు భూతరాజు, ఉపాధ్యక్షురాలు రత్నమ్మ, ఐసిడిఎస్ ఉపాధి హామీ వెలుగు సిరికల్చర్ వైద్య, శాఖ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'కళ్లకలక'పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-తాడిమర్రి

విద్యార్థులకు 'కళ్లకలక' పరీక్షలు చేస్తున్న వైద్యులు

స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హరిత సూచనల మేరకు శనివారం బిసి హాస్టల్, కెజిబిబిలో విద్యార్థులకు ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప 'కళ్లకలక'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉరుకుందప్ప మాట్లాడుతూ కళ్లకలక పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తగిన జాగ్రత్తలు పాటిస్తే మూడు నుంచి నాలుగు రోజుల్లో దానికదే తగ్గిపోతుందన్నారు. కళ్లకలక బాధితులు ఇతరులకు దూరంగా ఉండాలని, వారి వస్తువులు వేరే వారు తాకరాదన్నారు. ప్రధానంగా సొంత వైద్యం చేసుకోవద్దని, వైద్యుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ విష్ణు, హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్, కెజిబివి ఎఎన్‌ఎం శివమ్మ, హెల్త్ అసిస్టెంట్స్ హర్షవర్ధన్, జానకిరామ్ పాల్గొన్నారు.

ఎంఇఒకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఇక్ర పాఠశాల యాజమా న్యం ఆధ్వర్యంలో శనివారం పాఠశాల ఆవరణలో ఎంఇఒ గంగప్పను ఘనంగా సన్మానించారు. కరస్పాండెంట్ మొహమ్మద్ అఖీబ్ జావిద్ మాట్లా డుతూ గంగప్ప హిందూపురం మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తూ, బహుముఖ ప్రజ్ఞా శాలి, గాయకుడు, కవి, రంగస్థలం నటుడిగా గంగప్ప పేరు ప్రఖ్యాతలు సాధించడం అభినందనీ యమన్నారు. విద్యాశాఖ అధికారిగా సేవలు అందించి విద్యారంగానికి పరిమితం కాకుండా సాహిత్య కళా రంగాలలో సైతం విస్తరించడం ప్రశంసనీయమన్నారు. ఆయన సేవలను గుర్తించి నేషనల్ కౌన్సిల్ ఫర్ పీస్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షాకిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఇఒను సన్మానిస్తున్న అఖీబ్ జావీద్, తదితరులు

సాగునీటిపై శ్రద్ధేది.?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా అంటేనే అత్యల్ప వర్షపాతం కలిగిన ప్రాంతం. దేశంలో జైసల్మీర్ తరువాత అతి తక్కువ వర్షపాతం కలిగిన ఈ ప్రాంతానికి సాగునీటి వనరులు న్నది కూడా చాలా తక్కువనే చెప్పాలి. నిఖర జలాలుగానున్నది తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ మాత్రమే. ఇక 2012 నుంచి హంద్రీనీవా ద్వారా నీరు వస్తున్నాయి. ఇప్పుడు రెండే ప్రధాన ఆధారంగానున్నాయి. వీటి ద్వారానే సాగు, తాగు నీరు ప్రజలకు అందుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 27 లక్షల ఎకరాల వరకు సాగుభూమి ఉంది. కాని ఇందులో సాగునీటి వసతి ఉన్నది రెండు లక్షల ఎకరాల్లోపే ఉంది. హంద్రీనీవా ద్వారా నీరుస్తున్నా ఇంకా పంట కాలువల నిర్మాణాలు ఎక్కడా పూర్తవలేదు. మొదటి దశలో 80 వేల ఎకరాల ఆయకట్టు నీరు ఇవ్వాలన్నది లక్ష్యం ఉన్నప్పటికీ పంటకాలువల నిర్మాణాలు ఇప్పటికీ ఆరంభమే అవలేదు. ఎంతున్నా వచ్చిన నీటిని చెరువులకు మళ్లించి వీటి ద్వారా పంటలకు నీరు ఇస్తున్నారు. దీని నిర్దిష్టమైన ఆయకట్టు ఏదీ లేదు. ఆయకట్టుకు నీరందించేందుకు వీలున్నది తుంగభద్ర ఎగువ కాలువ కిందనే. దీని కిందనున్న కాలువల పరిస్థితి అధ్వాన్నంగా మారుతున్నాయి. కొన్ని దశాబ్దాలుగా ఆధునీకరణగానూ, మరమ్మ తులకుగాని నిధుల కేటాయింపులు నామమాత్రంగా జరుగుతూ ఉన్నాయి. దీంతో గట్లు బలహీనపడి ఎప్పుడు ఎక్కడ గండ్లు పడతాయో తెలియని పరిస్థితులున్నాయి. ఈ వారంలో రెండు కాలువలకు గండ్లు పడ్డాయి. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు ఒకచోట పడగా, పిఎబిఆర్ కుడికాలువకు ఒకచోట పడ్డాయి. దీంతో రెండు చోట్ల కాలువ కిందనున్న పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఇక అంతక మునుపు వారంలో కాలువలకు నీరు విడుదల చేయడానికి గేట్లు ఎత్తేందుకు పోతే అవి పైకి లేవ అధికారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఇవన్నీ కూడా సాగునీటికి పాలకులు ఏ మేరకు శ్రద్ధ చూపుతున్నారన్న చర్చకు దారితీస్తున్నాయి.

ఈ వారంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతు ఆత్మహత్యలు కొనసాగాయి. కూడేరులో ఒక రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకు మునుపు పుట్లూరులో అరటి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. తాడిమర్రి మండలంలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా వరుసగా రైతు ఆత్మహత్యలు జరుగు తున్నాయి. తాజాగా ఈ వారంలో ఉరవకొండ ప్రాంతంలో అత్యధికంగా మిరప పంటకు అగ్గి తెగళ్లు సోకి వందల ఎకరాల్లో పంటలు దెబ్బతింటు న్నాయి. వీటి నివారణ ఏ చర్యలు తీసుకోవాలన్న దానిపై శాస్త్రవేత్తలు ఆ ప్రాంతంలో పర్యటించారు. ఇలా రైతుకు అన్ని విధాలుగా కష్టాలే ఎదురవుతు న్నాయి. ఒకవైపు ప్రకృతి వైపరిత్యాలు మరోవైపు గిట్టుబాటు ధరల్లేక పంట పండినా రైతుకు నష్టాలే మిగిలే పరిస్థితులు నెలకొన్నాయి. రైతుకు అధిక ప్రాధాన్యతనిస్తామని ప్రభుత్వాలు ప్రకటనలు చేయడం మినహా రైతుకు మద్దతు ధరకు పంటలు కొనే పరిస్థితి లేదు. కనీసం సాగునీటిని సక్రమంగా అందివ్వలేకపోతున్నారు. పంటల కాలువల మరమ్మతులు, ఆధునీకరణకు దశాబ్దాలుగా చేపట్టడం లేదు. దీంతో సాగునీటి కష్టాలు తొలగడం లేదు. వచ్చే ఏడాది బడ్జెట్‌లోనైనా పాత ఆయకట్టు స్థిరీకరణకు కోసం నిధులు కేటాయించి పరిష్కారానికి కృషి చేస్తారా లేదా అన్న చర్చ నడుస్తోంది. వచ్చే ఏడాది కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే ఆయకట్టు రైతులకు రాబోయే రోజుల్లో మరిన్ని కష్టాలు తప్పేలా కనిపించడం లేదు. హంద్రీనీవాతోపాటు, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.